పరిహారం ఇవ్వరు..

పనులు చేయరు

- రూ.290 కోట్లతో 9 కిలోమీటర్ల మేర మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లికి లింక్ కాలువ నిర్మాణం
- రైతుల నుంచి 120 ఎకరాల భూ సేకరణ
- ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు

5లో


సంగారెడ్డిలో ఘనంగా పీర్ల పండుగ

హాజరైన జగ్గారెడ్డి



సంగారెడ్డి టౌన్, జూలై 17: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో పీర్ల పండుగ బుధవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని ఉప్పర్ బజార్ వద్ద జరిగిన ఈ ఉత్సవాలను తిలకించేందుకు పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన పిల్లలు, పెద్దలు కులమతాలకతీతంగా భారీ సంఖ్యలో తరలివచ్చారు. పీర్ల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి ఆటలాడుతూ ప్రజలను ఉత్తేజపరిచారు. పట్టణంలోని పాత బస్టాండ్, సినిమా రోడ్, నాల్‌సాబ్‌గడ్డ, రిక్షా కాలనీ తదితర ప్రాంతాల్లో పీర్లను ఊరేగించారు. మొహర్రంను పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలు జగ్గారెడ్డిని ఘనంగా సన్మానించారు.

◄ పీర్ల ఊరేగింపులో ముస్లింలతో జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

వైభవంగా తొలి ఏకాదశి

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాలు కిటకిటలాడాయి. రుక్మిణీ విఠలేశ్వర ఆలయాల్లో విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించారు. వైష్ణవ ఆలయాలను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.





పెద్దశంకరంపేటలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కల్హేర్ రామాలయంలో భజన నిర్వహిస్తున్న భక్తులు


సంగారెడ్డిలో డీ మార్టు వద్దు

- వ్యతిరేకిస్తున్న జగ్గారెడ్డి
- వర్తక వ్యాపార సంఘాలకు మద్దతు

సంగారెడ్డి టౌన్, జూలై 17 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద డీ మార్టు ఏర్పాటు చేయొద్దంటూ పలువురు వర్తక వ్యాపార సంఘాల నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపత్రాన్ని అందజేశారు. డీ మార్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా పట్టణంలోని వర్తక వ్యాపార సంఘాల నాయకులతో పాటు కిరాణ మర్చంట్ గౌరవాధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టీ.జగ్గారెడ్డిని కలిసి విన్నవించారు. వారికి మద్దతుగా నిలిచిన జగ్గారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద డీ మార్టు ఏర్పాటు చేస్తే దాదాపు 500 మంది చిరు వ్యాపారులు నష్టపోతారని జగ్గారెడ్డి మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో కిరాణ వర్తక వ్యాపార సంఘం గౌరవాధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్, అధ్యక్షుడు మిర్యాల పాండు, ప్రతినిధులు కూన సంతోష్, అక్షింతల మదన్ మోహన్, మురళి, బీ.శ్రీనివాస్, కటకం విజయ్, న్యాయవాది పి.సంగమేశ్వర్, దినేష్, అజర్, యూసుఫ్ తదితరులు ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, వర్తక వ్యాపార సంఘాల ప్రతినిధులు



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ముహూర్తం రానే వచ్చింది. రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేసే తరుణం ఆసన్నమైంది. తొలి విడతగా రూ.లక్ష లోపు రుణం పొందిన రైతుల ఖాతాల్లో నేడు నగదు జమ చేస్తామని ప్రకటించింది. సాయంత్రం 4గంటల వరకు వీరి ఖాతాల్లోకి మాఫీ సొమ్ము పడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతు వేదికల్లో సంబరాలు నిర్వహించడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతుల అభిప్రాయాలను వినబోతున్నారు.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 17

రుణమాఫీకి వేళాయే

- రూ.లక్ష లోపు రుణగ్రస్తులకు తీపికబురు
- నేడు సాయంత్రం 4 గంటలకు ఖాతాల్లోకి..
- సంబరాలకు రైతువేదికల ముస్తాబు
- ఉమ్మడి జిల్లాలో 1,52,270 మంది రైతులకు లబ్ధి
- రెండో దశపై మిగతా వారి ఆశలు

జిల్లాల వారీగా నేడు లబ్ధి పొందే రైతులు	
సంగారెడ్డి	51,164
సిద్దిపేట	53,128
మెదక్	47,978
మొత్తం	1,52,270

బ్యాంకుల ద్వారా 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 13వరకు రూ.2లక్షల లోపు రుణం పొందిన రైతులను రుణమాఫీ అర్హులుగా తేల్చడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 5లక్షల మంది ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇందులో తొలి విడతగా లక్ష లోపు రుణం పొందిన వారికి నేడు లబ్ధి చేకూరనున్నది. ఈ జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి 1,52,270 మంది ఉన్నట్లుగా వ్యవసాయశాఖ అధికారికంగా ప్రకటించింది.

పాస్‌బుక్కే ప్రామాణికంగా..

ప్రస్తుత జాబితా ప్రకారం వ్యవసాయ భూమికి సంబంధించిన పాస్‌బుక్‌నే ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో 2 నుంచి 3 ఎకరాల భూమి ఉన్న వారే ఎక్కువగా ఉండడంతో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. రూ.లక్ష లోపు రుణం పొందినవారిలో చిన్న, సన్నకారు రైతులే ఉండడం ఈ జాబితా తయారీకి సులభతరమైంది. ఇక రూ.2 లక్షల లోపు రుణం పొందినవారిలో ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారుల సంఖ్య అధికంగా ఉండడంతో ఆ జాబితాపై తర్జనభర్జన పడుతున్నారు. ఒక కుటుంబానికి రూ.2లక్షల లోపు రుణమాఫీ జరుగుతుందని అధికారికంగా ప్రకటించడంతో ఆయా కుటుంబాల్లోని ఖాతాలను పరిశీలిస్తున్నారు. తగిన పరిస్థితుల్లో రేషన్‌కార్డును సైతం పరిగణనలోకి తీసుకోబోతున్నారు. తొలి విడత రుణమాఫీ సొమ్ము జమ కానుండటంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతోంది. ఆగస్టు 15లోగా తుది జాబితా రైతులకు లబ్ధి చేకూరుతుందని ప్రకటించడంతో ఆ వర్గం ఆసక్తితో ఎదురుచూస్తోంది.

సంబరాలకు సన్నద్ధం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ఎన్నికల సమయంలో ఈ హామీ ఎక్కువ మంది రైతులను ఆకర్షించింది. అప్పటికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ రూ.లక్ష వరకు రుణమాఫీ చర్యలను కొనసాగించింది. కానీ, సంక్షేమ పథకాలతోపాటు రూ.2లక్షల వరకు రుణమాఫీ అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించడం ఆ పార్టీ విజయానికి కలిసివచ్చింది. అన్నట్లుగానే రూ.2లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేశారు. తొలిదశగా నేడు రూ.లక్ష వరకు రుణం పొందిన వారి ఖాతాల్లో సొమ్ము జమచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో సంబరాలు నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ప్రతీ రైతువేదికలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. రైతులంతా సంబరాల్లో ఉండగానే సాయంత్రం 4 గంటలకు వారి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ రైతు వేదికల్లో ఉన్న రైతులతో మాటామంతీ జరుపుతారు.


తూప్రాన్ గురుకులంలో సీనియర్లు, జూనియర్ల మధ్య ఘర్షణ

పలువురు విద్యార్థులకు గాయాలు



తూప్రాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి రాకేష్


తూప్రాన్, జూలై 17: మెదక్ జిల్లా తూప్రాన్‌లోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. సీనియర్లకు గౌరవం ఇవ్వడం లేదంటూ కొందరు విద్యార్థులు జూనియర్లపై దాడికి దిగారు. దుస్తులు ఉతికే సమయంలో ప్రారంభమైన గొడవ రాత్రి ఇరు వర్గాల మధ్య దాడులకు కారణమైంది. ఐదుగురు గాయపడగా, ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ (టోల్‌ప్లాజా) వద్ద తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ సీనియర్ విద్యార్థులకు జూనియర్లు గౌరవం ఇవ్వడం లేదంటూ కొంత కాలంగా వివాదం ఉంది. మంగళవారం సాయంత్రం సీనియర్ విద్యార్థి ఒకరు దుస్తులు ఉతుక్కుంటుండగా, జూనియర్ విద్యార్థి స్నానం చేసేందుకు వచ్చాడు. ఈ సమయంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు చెబుతున్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులతో పదో తరగతి విద్యార్థులు కలిసి ఉండటం కూడా సీనియర్ల ఆగ్రహానికి కారణమని చెబుతున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో జూనియర్, టెన్త్ విద్యార్థులు బయట గ్రౌండ్‌లో ఉండగా, కొందరు సీనియర్లు వారి వద్దకు వచ్చారు. మాట్లాడాలంటూ మొదటి అంతస్థులోకి తీసుకెళ్లారు. ఇందులో ఓ జూనియర్ వారికి సమాధానం ఇస్తుండటంతో ఎదురు మాట్లాడుతున్నావంటూ ఓ సీనియర్ కొట్టాడు. దీంతో విద్యార్థి ముక్కు నుంచి రక్తం కారింది. ఈ సమయంలోనే జూనియర్ల గదిలోని బకెట్లతో సీలింగ్ ఫ్యాన్‌ను కొట్టారు. దీంతో బకెట్లు పగిలిపోగా, సీలింగ్ ఫ్యాన్ వంగిపోయింది. ఓ విద్యార్థి పెట్టె కూడా పగిలిపోయింది. గొడవలో ముగ్గురు జూనియర్ విద్యార్థులకు, ఇద్దరు సీనియర్ విద్యార్థులకు గాయాలయ్యాయి. కొందరు విద్యార్థులు రాళ్లు సైతం రువ్వారు. విషయం తెలిసి దగ్గర ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారు. తీవ్రంగా గాయపడిన జూనియర్ విద్యార్థి రాకేష్ తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి బుధవారం గురుకుల పాఠశాల కార్యదర్శి రమణకుమార్ వచ్చి ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, తూప్రాన్ ఎస్‌ఐ శివానందం, మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ గురుకులానికి వచ్చి వివరాలు సేకరించారు. గురుకులంలో చిన్న గొడవ జరిగిందని ప్రిన్సిపాల్ మురళి తెలిపారు. పెద్దగా గాయాలు కాలేదని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దంటు సూచించారు.



పగిలిన బకెట్లు



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్‌ఐ



బీఆర్‌ఎస్‌కు బీటలు

పటాన్‌చెరు నియోజకవర్గంలో రెండుగా చీలిన నాయకులు

- ఎటూ తేల్చుకోలేని కార్యకర్తలు
- తిరిగి పుంజుకునే ప్రయత్నాలు
- వేచి చూసే ధోరణిలో కొందరు

పటాన్‌చెరు, జూలై 17 : పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గం రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకుంటున్న ద్వితీయ శ్రేణి నాయకులు రెండు వర్గాలుగా వీడిపోయి ఆధిపత్యం సాధించేందుకు సొంతంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎటువైపు మొగ్గుచూపితే ఏం లాభం కలుగుతుందో అన్న అభిప్రాయంతో కొందరు పార్టీ మారకుండా వేచిచూసే ధోరణిలో ఉన్నారు. బీఆర్‌ఎస్ కేడర్‌ను మొత్తం తనతో పాటే కాంగ్రెస్‌లోకి తీసుకెళ్లాలని భావించిన ఎమ్మెల్యేకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం గమనార్హం.

ఎమ్మెల్యేకు అండగా నమ్మినబంట్లు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి నమ్మిన బంట్లుగా ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తున్న వారే ఆయన తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పార్టీ మారారు. ప్రధానంగా జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, పటాన్‌చెరు మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ జడ్పీటీసీలు సుప్రజావెంకట్‌రెడ్డి, గంగుల సుధాకర్‌రెడ్డి, భానూర్ మాజీ సర్పంచ్ దశరథరెడ్డి, పటాన్‌చెరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహగౌడ్, గుమ్మడిదల మాజీ ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గడీల కుమార్‌గౌడ్, పటాన్‌చెరు పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు ఎమ్మెల్యేకు మద్దతుగా కాంగ్రెస్‌లో చేరారు. ఇక బీఆర్‌ఎస్‌లోనే కొనసాగేందుకు నిర్ణయించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్‌లు మెట్టు కుమార్‌యాదవ్, సింధూఆదర్శరెడ్డి దంపతులు, బొల్లారం మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజాబాల్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ లలితాసోమిరెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. కొన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రస్తుత మున్సిపల్ కౌన్సిలర్లు తమ రాజకీయ భవిష్యత్తుకు భరోసా ఇస్తేనే కాంగ్రెస్‌లో చేరతామని తేల్చిచెబుతున్నారు. గ్రామ, మండల స్థాయి కేడర్‌ను కాపాడుకునేందుకు ఇటు ఎమ్మెల్యే అటు బీఆర్‌ఎస్ వర్గాలు పావులు కదుపుతున్నారు. త్వరలోనే వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సమక్షంలో భారీగా చేరికలు ఉంటాయని ఎమ్మెల్యే వర్గం పేర్కొంది. వాటికి అడ్డుకట్ట వేసేందుకు మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగారు. బుధవారం రాంచంద్రాపురంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కార్యకర్తల్లో మనోధైర్యం నింపే ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ కేడర్‌లో గందరగోళం

పదేళ్లుగా నియోజకవర్గంలో కష్టపడుతూ వస్తున్న కాంగ్రెస్ కేడర్‌లో మాత్రం గూడెం చేరికతో కలవరం మొదలైంది. నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ఇంకా అలకవీడకపోవడం గమనార్హం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత కాంగ్రెస్ కేడర్‌కు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శ్రీనివాస్‌గౌడ్‌తో చర్చలు జరిపి సానుకూల వాతావరణం ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. పాత కాంగ్రెస్ కేడర్‌తో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి పోయేందుకు కొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వెంకట ఖ్వాజా ఆశ్రమంలో సప్త భజన ప్రారంభం

వట్‌పల్లి, జూలై 17: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వట్‌పల్లిలోని వెంకట ఖ్వాజా ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతి అప్పగారి 109వ జయంతిలో భాగంగా బుధవారం మొదటిరోజు సప్తభజన ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీవరకు సప్త భజన కొనసాగుతుందని, చివరిరోజు డోలారోహణం కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భోజనం, మంచినీటి వసతి ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు వెంకటరెడ్డి రాములు చిస్తీ తెలిపారు.

అరుణాచలం వెళ్లే బస్సును సద్వినియోగం చేసుకోవాలి: డీఎం



ఖేడ్‌లో అరుణాచలం వెళ్లడానికి టికెట్ బుక్ చేసుకున్న వారికి అందిస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్, జూలై 17: ఈనెల 21న గురు పౌర్ణమిని పురస్కరించుకుని నారాయణఖేడ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నందున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం మల్లేశయ్య కోరారు. బుధవారం అరుణాచలంకు టికెట్ బుక్ చేసుకున్న వారికి బస్టాండ్‌లో ఆయన రశీదులు అందించారు. అనంతరం 19న శుక్రవారం సాయంత్రం నారాయణఖేడ్ నుంచి బస్సులు బయలుదేరి, 20న కాణిపాకంకు, వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటాయన్నారు. అదేరోజు సాయంత్రానికి అరుణాచలం చేరుకుంటారని పేర్కొన్నారు. 21న గురు పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణ, అక్కడి నుంచి జోగులాంబ శక్తి పీఠం దర్శించుకున్న అనంతరం 22న నారాయణఖేడ్ చేరుకుంటారన్నారు. రానుపోను బస్సు చార్జీలు ఒక్కొక్కరికి రూ.4,500 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ పాండు, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వరు.. పనులు చేయరు



కుకునూరుపల్లి మండలం లకుడారం శివారులో నిలిచిన కాలువ పనులు

● రూ.290 కోట్ల అంచనాలతో 9 కిలోమీటర్ల కాలువ నిర్మాణం

- రైతుల నుంచి 120 ఎకరాల భూ సేకరణ
- ప్రభుత్వం మారడంతో నిలిచిన కాలువ నిర్మాణ పనులు
- పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

కుకునూరుపల్లి, జూలై 17: గత కేసీఆర్ ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు లింకు కాలువల ద్వారా నీటిని తరలించాలనే కృత నిశ్చయంతో కాలువ నిర్మాణ పనులను ప్రారంభించింది. 2022 సంవత్సరంలో రూ.290 కోట్ల అంచనాలతో 9 కిలోమీటర్ల మేర ఈ కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. నిర్మాణ బాధ్యతలను కావేరి ఇంజనీరింగ్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీనికోసం ఐదు గ్రామాల రైతుల నుంచి భూమిని సేకరించి పనులను మొదలుపెట్టారు.



కూలీలు, సామగ్రి కోసం నిర్మించిన గృహాలు

ఐదు గ్రామాలు.. 200 ఎకరాలు

వరంగల్ జిల్లా ధర్మాసాగర్ నుంచి బొమ్మకూర్ రిజర్వాయర్, బొమ్మకూర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు. ధర్మసాగర్ దాదాపు 80 కిలోమీటర్లు దూరం కావడంతో పక్కనే ఉన్న మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు తరలించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 9 కిలోమీటర్ల లింకు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. దీనికి సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలోని మంగోల్, కోనాయిపల్లి, మెదినీపూర్, లకుడారం, తపాస్‌పల్లి రైతుల నుంచి 200 ఎకరాల భూమి అవసరం ఉండగా.. 120 ఎకరాలను సేకరించి పనులు ప్రారంభించారు. 200 మీటర్ల సొరంగం పనులు, రెండు కిలోమీటర్లు కాలువ నిర్మాణ పనులు జరిగాయి. కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.16 లక్షల పరిహారం అందజేస్తామని చెప్పింది. కానీ మూడేళ్లవుతున్నా.. ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా పరిహారం అందించలేదు. ఐదు గ్రామాల రైతులకు దాదాపు రూ.30 కోట్ల పరిహారం రావాల్సి ఉన్నది.

ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ లింకు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. కానీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ఆరు నెలలుగా కాలువ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. నిధుల లోటుతోనే పనులు ఆగినట్లు తెలుస్తున్నది. నిర్మాణ పనుల కూలీల కోసం, నిర్మాణ సంస్థ వాహనాలు, సామగ్రి కోసం లకుడారం, మెదినీపూర్ గ్రామాల శివారులో తాత్కాలిక వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులు నిలిచిపోవడంతో సామగ్రిని, వాహనాలను ఇక్కడి నుంచి తరలించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణ పనులను చేపడుతుందో.. లేదో వేచి చూడాలి.

తహసీల్దార్ నుంచి మంత్రివరకు విన్నపాలు

కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు మండలస్థాయిలో ఉండే తహసీల్దార్ మొదలుకుని, ఆర్డీవో, కలెక్టర్, అప్పట్లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇప్పుడు నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా రైతులకు పరిహారం అందలేదు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పరిహారాన్ని అందజేయాలని కోరుతున్నారు.

త్వరగా భూ పరిహారం అందజేయాలి



నాకు ఉన్న 2 ఎకరాల వ్యవసాయ భూమిలో ఎకరం భూమిని కాలువ నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం ఇచ్చాను. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించి భూ పరిహారాన్ని అందజేయాలి.

\- జిల్ల నర్సింహులు, భూ బాధితుడు, లకుడారం

ప్రతిపాదనలు పంపాం

కాలువ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల వివరాలను ప్రభుత్వానికి అందజేశాం. నిధులు రాగానే పరిహారం పంపిణీ చేస్తాం.

\- మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్, కుకునూరుపల్లి

'ఆభా' ఓపీ సేవల్లో సంగారెడ్డి జీజీహెచ్ నంబర్ వన్

సంగారెడ్డి అర్బన్, జూలై 17: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి 'ఆభా' యాప్ ద్వారా ఔట్ పేషెంట్ (ఓపీ)సేవల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విషయాన్ని వెల్లడించారు. గత మే నెలలో ఆస్పత్రిలో ఆభా(ఏబీహెచ్ఏ-ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్, టోకెన్ సిస్టమ్ ద్వారా మొబైల్ ఓపీ రిజిస్ట్రేషన్ చేసే సరికొత్త విధానాన్ని రోగులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ద్వారా వైద్య సేవలకు వచ్చే రోగి వరుసలో గంటల తరబడి నిలబడే అవసరం లేకుండా నేరుగా టోకెన్ ద్వారా ఓపీ చికిత్సలు పొందే ఆస్కారం ఏర్పడిందన్నారు. నిత్యం ఓపీ ద్వారా సుమారు 1500 మంది రోగులు ఓపీ ద్వారా వైద్య సేవలు పొందుతుండగా, అందులో ఆభా యాప్ ద్వారా సుమారు 700 మంది ఓపీ రిజిస్ట్రేషన్ నమోదవుతుందన్నారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఎంపిక చేశారన్నారు. ఇందులో వైద్య సిబ్బంది కృషి, సహకారం చాలా ఉందన్నారు.



బోల్తాపడిన డీసీఎం

అదుపుతప్పి డీసీఎం బోల్తా

● పట్టుబడిన రేషన్ బియ్యం

కొండపాక, జూలై 17: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం డీసీఎం బోల్తాపడడంతో పోలీసులకు పట్టుబడ్డాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం కొండపాక మండలం దుద్దెడ శివారులో మూలమలుపు వద్ద బోల్తా పడింది. డీసీఎంలో ఉన్న బియ్యం బ్యాగులన్నీ కిందపడి చెల్లా చెదురయ్యాయి. వాటి గురించి ఆరాతీయగా రేషన్ బియ్యంగా తేలింది. సంఘటనా స్థలానికి త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ చేరుకొని విచారణ చేశారు. సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల నుంచి వికారాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా డ్రైవర్ రాజు అతివేగంగా నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. రేషన్ బియ్యాన్ని జిల్లెల్ల గ్రామానికి చెందిన తాళ్ల రాజు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మేందుకు డీసీఎం ఓనరు పాండు, క్లీనర్ బెల్లె నితిన్‌కుమార్‌తో కలిసి అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో డీసీఎం బోల్తాపడడంతో డ్రైవర్ రాజు, క్లీనర్ నితిన్‌కుమార్ గాయపడ్డారు. డీసీఎంలోని 140 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనాలు



కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్యులకు జ్ఞాపికను అందజేస్తున్న పద్మశ్రీ గరికపాటి నరసింహారావు

సదాశివపేట, జూలై 17: పట్టణంలోని బసవసేవాసదన్, చౌకీమఠంలో కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య పర్యవేక్షణలో నిర్వహిస్తున్న శివపంచాక్షరి-కోటిజపయజ్ఞ, ఇష్టలింగార్చన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మహాసహస్ర అవధాని-పద్మశ్రీ గరికపాటి నరసింహారావుచే ఆధ్యాత్మిక, జ్ఞాన, సేవా, మానవత్వం, కుటుంబం-సమాజంలో విలువలు వంటి అనేక అంశాలపై అందించిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గరికపాటి మాట్లాడారు. ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రం సర్వ శ్రేయస్కరమన్నారు. మహాత్మ బసవేశ్వరుడు మానవతావాది అని, అందరినీ భక్తిమార్గంలో నడిపిన మహనీయుడన్నారు. బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలన్నారు. సదాశివపేట వీరశైవ సమాజం-చౌకీమఠం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని గరికపాటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు, మహిళలు, వీరశైవ సమాజం చౌకీమఠం అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం పాల్గొన్నారు.

వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించిన న్యాయాధికారి

నర్సాపూర్, జూలై 17: నర్సాపూర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద ఓ అనాథ వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్థానికులు న్యాయాధికారి కె.అనితకు మండల లీగల్ కమిటీ ద్వారా సమాచారమందించారు. వెంటనే స్పందించి వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. రుస్తుంపేటకు చెందిన వృద్ధుడి స్థిరాస్తిని సమీప బంధువులు లాగేసుకుని గెంటేశారు. దీంతో కొన్నేళ్లుగా నర్సాపూర్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ విషయమై విచారించి ఆస్తిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయాధికారి అనిత ఎస్ఐ పుష్పరాజ్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా తొలిఏకాదశి సందర్భంగా నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అనిత స్థానిక శివాలయంలో కుటుంబీకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యూనిఫామ్ కుట్టు కూలి నిధులు విడుదల

● సంగారెడ్డి జిల్లాకు రూ.51,15,900 మంజూరు



సంగారెడ్డి అర్బన్, జూలై 17 : సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల 2024-25 విద్యా సంవత్సరానికిగాను యూనిఫామ్‌ల కుట్టు కూలికి సంబంధించిన నిధులను విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాకు రూ.51,15,900 మంజూరు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్‌లకు సంబంధించి అవసరమైన వస్త్రాన్ని ప్రభుత్వమే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరఫరా చేసింది. ఎంపిక చేసిన స్వయం సహాయక మహిళలకు ఆ వస్త్రాన్ని అందజేసి యూనిఫామ్‌లను కుట్టించారు. జిల్లా వ్యాప్తంగా 1,215 ప్రభుత్వ పాఠశాలల్లో 1,02,318 మంది విద్యార్థులకు ఒక జతకు రూ.50 చొప్పున ప్రభుత్వం రూ.51,15,900 నిధులను ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను యూనిఫామ్‌లు కుట్టిన స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేయనున్నారు. అయితే ఇటీవల కుట్టు కూలీ చార్జీలను ప్రభుత్వం ఒక జతకు రూ.75 పెంచినప్పటికీ ప్రభుత్వం మాత్రం రూ.50 చొప్పున మాత్రమే విడుదల చేయడం గమనార్హం.

ఖాళీ ఏర్పడిన పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్

నారాయణఖేడ్, జూలై 17: ఉపాధ్యాయులకు సంబంధించి ఖాళీ ఏర్పడిన పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి, భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణఖేడ్‌లో సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల రీజినల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీలను చేపట్టడం అభినందనీయమన్నారు. బదిలీ అయిన ఎస్జీటీలను వెంటే రిలీవ్ చేయాలన్నారు. అవసరాల మేరకు వీవీలను నియమించాలన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, ఈఎల్స్ సరెండర్ తదితర బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. నాలుగు డీఏలను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, నాయకులు ఏశప్ప పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆచార్య డాక్టర్ సుభాష్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సమాజం కోసం పరితపించే సామాజికవేత్త ఆచార్య డాక్టర్ సుభాష్

● ఆచార్య సుభాష్ పార్థీవ దేహానికి కేటీఆర్, ఎమ్మెల్యే కేపీఆర్‌ల నివాళి

దుబ్బాక, జూలై 17: పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమస్యలపై నిరంతరం పరితపించి, జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ కారంపురి సుభాష్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామరావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్య డాక్టర్ సుభాష్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన పార్థీవ దేహాన్ని సన్నిహితుల సందర్శనార్థం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంచారు. అనంతరం దుబ్బాకలోని నివాసానికి తీసుకొచ్చి, తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు చేశారు. హైదరాబాద్‌లో సుభాష్ పార్థీవదేహాన్ని సందర్శించిన కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి శశికళ, కుమారులు సుజయ్, సుశీల్‌లను పరామర్శించారు. దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సుభాష్ పార్థీవ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అంతేగాక మాజీ ఎంపీపీ శ్రీరాం అనసూయ, సీనియర్ నాయకులు ఆర్.రాజమౌళి, మాజీ సర్పంచ్ శ్రీరాం రవీందర్, చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్లు బోడ శ్రీనివాస్, ఆలేటి చంద్రమౌళి, పద్మశాలి సంఘం, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.



దుబ్బాకలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

వరుణుడి కటాక్షం కోసం.. చిర్రగోనే ఆట

శివ్వంపేట, జూలై 17 : కార్తెలన్నీ ముగుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక వానాకాలం పంటల సాగు ముందుకు సాగక నార్లు ముదిరిపోతున్నాయి. వర్షాలు కురవాలని మండల కేంద్రమైన శివ్వంపేట చింతల్ మైదానంలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వరుణుడిని ప్రార్థిస్తూ పలువురు యువకులు చిర్రగోనే ఆడారు. ఈ సందర్భంగా యువకులు దుర్గేష్, పోచయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు ఆలస్యం అయితే చిర్రగోనే ఆడితే పడుతాయని నమ్మకంతో ఆడుతామని చెప్పారు. వరుణ దేవుడి కరుణతో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరారు.



శివ్వంపేటలో వర్షాల కోసం చిర్రగోనే ఆడుతున్న యువకులు

అదనపు వసూళ్లకు ఫుల్‌స్టాప్

- మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు
- క్యూఆర్ కోడ్‌తో నిర్దేశిత రుసుమే వసూలు
- తీరనున్న వినియోగదారుల ఇబ్బందులు
- కమీషన్ పెంచాలంటున్న నిర్వాహకులు

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 17: వినియోగదారులకు సులభంగా సేవలందించాలనే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో 2011లో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 209 కేంద్రాలు ఉన్నాయి. మహిళా శక్తి ద్వారా మరో 29 కొత్తగా రానున్నాయి. మీసేవ కేంద్రాల్లో ఏ సర్టిఫికెట్‌కైనా దాదాపు రూ.100 తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కొందరు నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధిక వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు మొదట మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూ సేవలన్నింటికీ నగదు రహిత చెల్లింపులు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జూలై 1 నుంచి ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. అంతకుముందే ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రైవేట్ కేంద్రాల్లోనూ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి. దీంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు స్కానర్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది.

రానున్న రోజుల్లో అన్ని సర్టిఫికెట్లకు..

మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూకు సంబంధించి ఏ సర్టిఫికెైనా క్యూ ఆర్ కోడ్ ద్వారానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. నిర్వాహకులు స్కాన్ చేయగానే ఎన్ని డబ్బులు చెల్లించాల్సి ఉంటుందో అన్నే డెబిట్ అవుతాయి. రానున్నరోజుల్లో అన్ని సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరిపే విధంగా చర్యలు తీసుకుంటుంది.

సెప్టెంబరు నుంచి ఎల్-1 డివైజ్‌ల వినియోగం

ఏ ప్రభుత్వ పథకానికైనా ఈ-కేవైసీ తప్పనిసరి. బయోమెట్రిక్ డివైజ్‌ల ద్వారా వేలిముద్రలు తీసుకుంటారు. నూతనంగా మీ సేవ కేంద్రాలకు కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని యూఐడీఏఐ ఆదేశాలు జారీచేసింది. మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతమున్న బయోమెట్రిక్ డివైజ్‌ల స్థానంలో తీసేసి ఎల్-1 పరికరాలను ఉపయోగించాలని ఆదేశాలను జారీ చేసింది. జూలై 1 తర్వాతే అమలు చేయాలని ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం సెప్టెంబరు వరకు గడువు విధించింది. ప్రతి మీసేవ కేంద్రం నిర్వాహకులు వీటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.



సిద్దిపేటలోని మీ సేవలో క్యూఆర్ కోడ్‌తో రుసుము చెల్లిస్తున్న వినియోగదారుడు

నిర్వహణ కష్టమవుతోంది

ప్రభుత్వ నిబంధనలతో పెరుగుతున్న నిత్యావసర ధరలు, కరెంటు బిల్లులు, అద్దెలతో మీ సేవ కేంద్రాల నిర్వహణ కష్టతరమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. నిబంధనలకు అనుగుణంగా సేవలందిస్తే ప్రభుత్వం రూ.10 కమీషన్ అందించింది. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు 2017లో రూ.10 కమీషన్‌ను రూ.15కు పెంచింది. కరోనా కంటే ముందు, తర్వాత అన్నిరకాల ముడి సరుకుల ధరలు, అద్దెలు పెరగడంతో జీవనం సాగించడం ఇబ్బందిగా ఉంది. కొత్త నిబంధనలతోపాటు కమీషన్ పెంచి, ఉచిత కరెంట్, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ఉచిత విద్యుత్‌తోపాటు ఇంటర్నెట్, స్టేషనరీ సౌకర్యం కల్పించాలి. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన పహాణీలు, 1బీ వంటి సేవలు ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. మహిళా సంఘాల ద్వారా సేవలు అందించడంతో జీవనోపాధి దెబ్బతింటోంది.

\- నగేష్, మీసేవ కేంద్రం నిర్వాహకుడు, నంగునూర్

ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారానే డబ్బులు చెల్లించాలి. ఈ విధానాన్ని అన్ని మీ సేవ కేంద్రాల్లో అమలుచేస్తాం. వినియోగదారులు పొందిన సేవలకు క్యూఆర్‌కోడ్ ద్వారానే రుసుము చెల్లించాలి. మీ సేవ కేంద్రాల నిర్వాహకులు సెప్టెంబర్ వరకు బయోమెట్రిక్ ఎల్-1 పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి.

\- ఆనంద్, ఈడీఏ

బతుకుదెరువు కోసం వెళ్తే.. చిన్నారిని చిదిమేసిన వీధి కుక్కలు

● కుటుంబంలో విషాదం



పిల్లలతో వెంకటలక్ష్మి, భరత్ దంపతులు

మిరుదొడ్డి, జులై17: బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లిన కుటుంబంలో విషాదం నెలకొంది. పుట్టిన గ్రామాన్ని విడిచి పని వెతుక్కుంటూ మహానగరానికి వెళ్లిన కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది. ముక్కు పచ్చలారని పసికందును వీధి కుక్కలు తీవ్రంగా గాయపరిచి పొట్టనపెట్టుకున్నాయి. తల్లి ఒడిలో హాయిగా నిద్రించాల్సిన చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న తమ బిడ్డను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తమ బిడ్డ ప్రాణాలను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు నీరుగారిపోయాయి. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో కుక్కకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన నిహాన్ (18నెలలు) అంత్యక్రియలు బుధవారం మిరుదొడ్డిలో ముగిశాయి. మిరుదొడ్డి పట్టణానికి చెందిన వెంకటలక్ష్మి, భరత్‌లు బతుకు దెరువు కోసం నెల క్రితమే జవహర్‌నగర్ వలస వెళ్లారు. ఇంటి బయట ఆడుకుంటున్న వారి కుమారుడు నిహాన్‌ను మంగళవారం వీధికుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో గాయాలపాలై, చికిత్స పొందుతున్న నిహాన్ అదే రోజు రాత్రి మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని మిరుదొడ్డికి తీసుకుని వచ్చి అంత్యక్రియలు జరిపారు.

కుటుంబానికి న్యాయం చేయాలి

జవహర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలదాడిలో చనిపోయిన చిన్నారి విహాన్ కుటుంబానికి అండగా ప్రజాసంఘాలు, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు పలువురు హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం బుధవారం ఎదుట ఆందోళనకు దిగారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి కుక్కల బారిన పడ్డాడని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, డబుల్‌బెడ్‌రూం లేదా ప్లాట్ అందించాలంటూ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మేడ్చల్ కలెక్టర్‌కు నివేదిక అందించామని, తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ. 50 వేలు అందించేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదే విషయమై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ చిన్నారి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 50 వేలు అందిస్తామని, కుటుంబంలోని ఒకరికి మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగంతో పాటు ప్లాంట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



గుమ్మడిదలలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి లక్ష తులసీ అర్చన నిర్వహిస్తున్న మహిళలు

దక్షిణాయనంలో వచ్చే తొలి ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఉపవాస దీక్షలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వట్‌పల్లి, జూలై 17: తొలి ఏకాదశి పురస్కరించుకొని బుధవారం దుద్యాల (సర్వేశ్వరపురి) త్రిమూర్తుల ఆలయంలో అర్చకులు విజయ్‌స్వామి క్షేత్రంలో ఉన్న త్రిమూర్తుల విగ్రహాలకు నారాయణ సూక్త పారాయణం చేస్తూ సప్త గంగాజలాలు, పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆశ్రమ పీఠాధిపతి శ్రీసర్వేశ్వరాంబికాశ్రయోగి తీర్థప్రసాదాల వితరణ చేశారు.

● గుమ్మడిదల: మండల కేంద్రంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేద మంత్రాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నిర్వహించిన లక్ష తులసీ అర్చన కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి వంశపారంపర్య ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో బుధవారం తొలి ఏకాదశిపర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షలతో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని సంజీవరావుపేట శ్రీ లక్ష్మీఅనంతపద్మనాభస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.



నిజాంపేట: చల్మెడ తిరుమల స్వామి ఆలయంలో పూజలు

● కంగ్టి: కంగ్టి విఠలేశ్వర ఆలయంలో వేకువ జామునుండే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఉపవాస దీక్షతో మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా వృద్ధి చెందాలని కోరుకుంటూ భజనలు చేస్తూ గ్రామ ప్రదక్షిణ చేశారు.

● కల్హేర్: కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని ఆలయాలు తొలి ఏకాదశి సందర్భంగా కళకళలాడాయి. కల్హేర్ రామాలయంలో వేకువ జామునే సీతారాముడు, లక్ష్మణుడి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం, అలంకరణ నిర్వహించారు. అనంతరం భక్తులు నిర్వహించిన భజన రామ నామంతో మార్మోగింది. భక్తులకు కల్హేర్ రామాలయ సేవాసమితి వారు పండ్లు పంపిణీ చేశారు.



నాగల్‌గిద్ద: కరస్‌గుత్తిలో వారికార్ సంప్రదాయంలో ఆకట్టుకున్న చిన్నారులు

● నాగల్‌గిద్ద: మండల పరిధిలోని కరస్‌గుత్తి పాండురంగ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పాండురంగడిని దర్శించుకున్నారు. కరస్‌గుత్తి గ్రామానికి చెందిన చిన్నారులు మహారాష్ట్ర వారీకార్ సంప్రదాయంతో కట్టు, బొట్టు వస్త్రాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

● రాయికోడ్: మండల కేంద్రంలోని శ్రీరుక్మిణీపాండురంగ ఆలయంలో ఉదయం అర్చకులు రుక్మిణీ సమేత పాండురంగస్వామి వారికి అభిషేకం, అర్చన, అలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రదక్షిణ, ఉట్టికొట్టే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. మండల పరిధిలోని నాగ్వార్, జంబ్గి, సింగీతం, పీపడ్‌పల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రాయికోడ్‌లో రుక్మిణీ పాండురంగస్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

● జహీరాబాద్: తొలి ఏకాదశి పర్వదినాన్ని నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని రుక్మిణీ పాండురంగ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది.

●పెద్దశంకరంపేట: మండలకేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయం, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, ఇతర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఠలేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి వేద బ్రాహ్మణపండితుల మంత్రోచ్ఛారణలతో రుక్మిణీవిఠలేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో జలాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

● నిజాంపేట: మండలంలోని చల్మెడ గ్రామంలో స్వయంభువుగా వెలిసిన తిరుమలస్వామి దేవస్థానంలో శ్రీభూదేవి శ్రీదేవి శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు అరుణ్‌శర్మ, వెంకట్, రామ్మోహనశర్మ, సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమలనాథ స్వామి ఆలయకమిటీ చైర్మన్ అక్కపల్లి రామిరెడ్డి, డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్: పాండురంగ ఆలయంలో స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులు

● వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీ వేంకటేశ్వస్వామి, రాజరాజేశ్వరిమాత ఆలయంలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పపూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

● చిన్నశంకరంపేట/రేగోడు/అల్లాదుర్గం: తొలి ఏకాదశి వేడుకలను చిన్నశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం మండలాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తల స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షతో సమీపంలోని వైష్ణవాలయాలకు వెళ్లి పత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి.



వెల్దుర్తి: బస్వాపూర్ మల్లన్న ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారికి చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

రామాయంపేట, జూలై 17: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ గురుకుల విద్యార్థినితో పాటు మరో నలుగురు గాయపడ్డారు. గాయపడినవారిలో ఏడాది వయసు గల చిన్నారి కూడా ఉంది. ఈ ఘటన రామాయంపేట పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన బాలికల గురుకులంలో పలువురు విద్యార్థులు కడుపు నొప్పితో బాధపడుతుండటంతో బుధవారం వారి తల్లిదండ్రులు వచ్చి సిబ్బందితో కలిసి పిల్లలను పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం గురుకులానికి తిరిగి వెళ్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో మొత్తం ఐదుగురికి గాయాలయ్యాయి.

పైపులైన్ ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

నర్సాపూర్, జూలై 17: నర్సాపూర్ పట్టణ పరిధిలో మంచినీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్‌ను ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసి పలు వార్డులకు నీరు సరఫరా కాకుండా నష్టం కల్గించిన హైదర్ బేగ్ అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జైతురాం నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణానికి చెందిన హైదర్‌బేగ్ అనే వ్యక్తి తన వ్యవసాయ పొలానికి పైపులైన్ వేసే క్రమంలో మిషన్‌భగీరథ పైపులైన్‌ను ధ్వంసం చేయడంతో పట్టణంలోని పలు వార్డులకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ విషయమై సదరు వ్యక్తిని మరమ్మతు చేయాలని మున్సిపల్ సిబ్బంది కోరగా అందుకు నిరాకరించడంతో పాటు ఇష్టానుసారంగా మాట్లాడినందున అతడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

కార్పొరేషన్ చైర్మన్లకు ఎంపీ సన్మానం



రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను సన్మానిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, రాష్ట్రప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నారాయణఖేడ్, జూలై 17:రాష్ట్ర ఎంబీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జైపాల్‌ను, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదను బుధవారం హైదరాబాద్‌లో జహీరాబాద్‌ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు కైలాస శ్రీనివాసగుప్తా వారి కార్యాలయాలకు వెళ్లి శాలువాలు వేసి పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంబీసీలకు సంబంధించి, మహిళలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

హరీశ్‌రావును కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ

జిన్నారం, జూలై 17: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్‌ఎస్ మండల నాయకులు కలిశారు. బుధవారం నియోజకవర్గ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన హరీశ్‌రావును మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంలో హరీశ్‌రావు నిర్వహించిన కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

మెదక్ అర్బన్, జూలై 17: మెదక్ ఆర్టీసీ డిపోకు మెరుగైన ఆదాయానికి కృషి చేసిన ఉత్తమ ఉద్యోగులను మెదక్ డీఎస్పీ రాజేష్, ఆటవీశాఖాధికారి రవికుమార్, డీఎం సుధా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని డిపో గ్యారేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16 మంది ఉద్యోగులకు బుధవారం నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆర్టీసీని నమ్ముకుని వచ్చిన ప్రయాణీకులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న మెదక్ డీఎస్పీ రాజేష్, జిల్లా అటవీశాఖాధికారి రవికుమార్

టీచర్ల లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్ పోస్టులు నింపాలి

● టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రామాయంపేట, జూలై 17: రాష్ట్రంలో లెఫ్ట్ ఓవర్ టీచర్ల ప్రమోషన్ పోస్టులు వెంటనే నింపాలని టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే 40 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. రెండేళ్ల క్రితమే ఇవ్వాల్సిన పీఆర్‌సీ ఆలస్యమైందని ఆయన బుధవారం మాట్లాడుతూ తెలిపారు.

ఐదవ రోజుకు రైతుల దీక్ష

నర్సాపూర్, జూలై 17: ఓ వైపు తొలి ఏకాదశి, మరోవైపు మోహర్రం పండుగలు ఉన్నా కూడా రైతులు తమకు న్యాయం చేయాలంటూ చేపట్టిన దీక్ష 5వ రోజుకు చేరింది. సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం రైతుల నుంచి తీసుకోనున్న భూములకు సరైన పరిహారం లేక భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్ష బుధవారం 5వరోజు చేరుకుంది. దీక్షలో బ్రాహ్మణపల్లి, చిన్న చింతకుంట గ్రామానికి చెందిన రైతులు రాంకిషన్, కొండల్, నర్సింహారెడ్డి, మహేష్‌గౌడ్, స్వామి, అర్జున్, స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, నగేష్‌గౌడ్‌తో పాటు రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్ పాల్గొన్నారు.

రుణమాఫీ జీవో సవరించాలి

నారాయణఖేడ్,జూలై 17: ప్రభుత్వం రైతుల రుణమాఫీకి సంబంధించి విడుదల చేసిన జీవో 567ను సవరించాలని సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ జీవోప్రకారం అమలు చేస్తే రైతులు పెద్ద ఎత్తున నష్టపోతారన్నారు. అందువల్ల జీవోనుసవరించి అర్హులైన వారందరికీ రూ.2 లక్షల రుణమాఫీని వర్తింపజేసి న్యాయం చేయాలన్నారు.

'చలో యాదగిరిగుట్ట' విజయవంతం చేయండి

కంది, జూలై 17 : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ పిలుపు మేరకు ఈ నెల 19న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న హలో మాదిగ-చలో యాదగిరిగుట్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగారెడ్డి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వావిలాల శంకరయ్య మాదిగ కోరారు. కందిలో బుధవారం ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల, గ్రామశాఖ ఇన్‌చార్జిలు పెద్దఎత్తున యాదగిరిగుట్టకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

● కొల్చారం: ఈ నెల 19వ తేదీన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వంలో యాదగిరిగుట్టలో జరగబోయే మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్, ఎర్రోళ్ల సంజీవయ్య పిలుపునిచ్చారు. కొల్చారంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరగాల్సిందేనన్నారు. బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వర్గీకరణ కోసం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశంలో ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు.

రుణమాఫీ ఓకే.. మీ రాజీనామా మాటేమిటి?

● హరీశ్‌రావుకు మెదక్ ఎమ్మెల్యే సవాల్

పాపన్నపేట, జూలై 17: రుణమాఫీ ఓకే.. మీ రాజీనామా మాట నిలబెట్టుకోండి అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు గుర్తు చేశారు. పాపన్నపేటలో బుధవారం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల వరకు ఇచ్చిన రుణమాఫీని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ఒక దఫాలో రూ.లక్షలోపు మాఫీ చేసి క్రమంగా రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పారు.ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో సైతం ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రైతులంతా గురువారం సంబరాలు చేసుకోవాలని కోరారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని తెలిపారు. దమ్మంటే రుణమాఫీ కాగానే హరీశ్‌రావు రాజీనామా చేసి చూపాలని సవాలు విసిరారు. అంతకు ముందు బాచారంలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన నలుగురు కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే తో పాటు కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

హత్నూర, జూలై 17: మండల పరిధిలోని సాదుల్లానగర్ గ్రామానికి మంజూరైన నిధులతో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువకులు, నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న యువకులు

హత్నూర, జూలై 17: హత్నూర మండల పరిధిలోని బొక్కలగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను స్థానిక యువకులు బుధవారం పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇక్కడ ఉపాధ్యాయుడిగా పని చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఒక్కరే ఉపాధ్యాయుడైనప్పటికీ ప్రతీ విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు శంకర్, గోపాల్, శ్రీశైలం, కృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యేను సన్మానించిన సీడీసీ చైర్మన్

నారాయణఖేడ్, జూలై 17: కామారెడ్డి జిల్లా మాగిలోని జీఎస్‌ఆర్ చక్కెర కార్మాగారం సీడీసీ చైర్మన్‌గా నియామకమైన నారాయణఖేడ్‌కు చెందిన శాదుల్ బుధవారం కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావును కలిసి శాలువాతో సన్మానించారు. సీడీసీ చైర్మన్‌గా నియామకానికి సహకరించినందుకు ఆయన ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జూలై 17: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేరేళ్ల శారదను బుధవారం ఆమె కార్యాలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మహిళల హక్కులు కాపాడడానికి, ఆడబిడ్డల చదువు విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.



నేరేళ్ల శారదను సన్మానిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎస్‌ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నాగల్‌గిద్ద ఎస్‌ఐని సన్మానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

నాగల్‌గిద్ద, జూలై 17: ఇటీవల నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన సాయిలును బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణిక్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరినాథ్, నాయకులు గుండేరావు, అనిల్‌పాటిల్, సంజీవ్‌పాటిల్, శ్రీకాంత్‌స్వామి, సంతోష్ తదితరులుపాల్గొన్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

● గ్రామాల్లో పీర్ల ఊరేగింపులు ● కుల మతాలకతీతంగా మొక్కులు చెల్లించుకున్న భక్తులు

త్యాగానికి ప్రతీకగా భావించే మొహర్రం సందర్భంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని గ్రామాల్లో సందడి వాతావరణం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు మతసామరస్యాన్ని కళ్లకు కట్టాయి. ఆయా గ్రామాల్లో డప్పు చప్పుళ్ల మధ్య పీర్లతో ఊరేగింపులు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా, కులమత బేధాలు పాటించకుండా ఊరేగింపుల్లో పాల్గొన్నారు.

● సదాశివపేట, జూలై 17: మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పీర్ల ఊరేగింపులతో సందడి వాతావరణం నెలకొన్నది. పట్టణంలో పుర వీధుల గుండా సాగే పీర్ల ఊరేగింపు (సవారీ)ను తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనవాయితీ ప్రకారం ఏటా మండలంలోని వెల్టూర్, కొండాపూర్ మండలం మారెపల్లి గ్రామాల నుంచి పీర్లు సదాశివపేటకు చేరుకుని పట్టణంలో పలు ప్రాంతాల్లో నెలకొల్పిన పీర్లతో కలిసి అలయ్.. బలయ్ తీసుకున్నాయి. మూడు గ్రామాల పీర్లతో పాటు తల్లి పీరు(దూదిపీరు-బీపాత్మ)లు పట్టణంలో పిట్లలకేరిలో సవారీలు అందుకున్నాయి. భక్తులు పీర్లకు ఊదు-బెల్లం, ఒడిబియ్యం, దట్టీలు సమర్పించారు.

● జహీరాబాద్: జహీరాబాద్ డివిజన్లోని జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్కల్ మండలాల్లో మొహర్రం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. రెండురోజులుగా పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో పీర్ల(పగటి సవార్ల) ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఓ వైపు పీర్ల ఊరేగింపు కొనసాగుతుండగా, మరోవైపు పీర్ల ముంగిట నిర్వహించిన ప్రత్యేక ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

● వట్‌పల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పాలడుగు, గొర్రెకల్, నాగులపల్లి, బిజిలీపూర్, మేడికుంద, షాద్‌నగర్ గ్రామాల్లో మొహర్ర కార్యక్రమాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దప్పుచప్పుళ్లతో పురవీధుల్లో పీర్లను ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు

● హత్నూర: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పీర్లతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

● గుమ్మడిదల: గుమ్మడిల మండలంలో ఆయా గ్రామాల్లో డప్పు చప్పుళ్లతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లం పానకం తయారు చేసి పంపిణీ చేశారు. పలువురు భక్తి శ్రద్ధలతో పీర్లకు దట్టికట్టి పీర్ల వద్ద ఉన్న విభూతిని నుదుట పూసుకున్నారు.



సదాశివపేటలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

● నారాయణఖేడ్: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో ప్రజలు ఐకమత్యంతో మొహర్రం కార్యక్రమాలను జరుపుకున్నారు. గ్రామాలతో పాటు నారాయణఖేడ్ పట్టణంలో ప్రతిష్ఠించిన పీర్లతో ఊరేగింపు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పీర్లను స్థాపించిన స్థలంలో లయబద్ధంగా మజన ఆడడం విశేషంగా ఆకట్టుకుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా కాళ్లకు గజ్జలు కట్టి గ్రామీణ మాండలికంలో, తమ నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలతో తయారు చేసిన పాటలను పాడుతూ మజన ఆడారు. కొన్ని గ్రామాల్లో ప్రత్యేక వేషాధరణలతో ప్రదర్శనలు, నాటకాలు ప్రదర్శించారు. నారాయణఖేడ్ మండలం చాప్టా.కెలో నిర్వహించిన మొహర్రం కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. పంచగామలో మాజీ సర్పంచు విఠల్‌రెడ్డి శర్బత్ పంపిణీని ప్రారంభించారు.

● కల్హేర్: కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో బుధవారం మొహర్రంను ప్రజలు మతాలకతీతంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద దూదిపీరీలు, చిన్న పీర్ల ఊరేగింపులతో కార్యక్రమాలను జరుపుకున్నారు.

● నాగల్‌గిద్ద: మండలంలోని ఆయా గ్రామాల్లో స్థానిక మసీదుల వద్ద బిఫాతిమా(దూద్‌పీరు), హుస్సేన్ పీర్లను ఊరేగించారు. అనంతరం స్థానిక బావుల వద్ద ప్రార్థనలు చేసి ప్రత్యేకంగా చేసిన షర్బత్‌ను పంపిణీ చేశారు. అనంతరం మజన ఆటలు, ప్రత్యేక వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.

● కంగ్టి: మండల కేంద్రమైన కంగ్టితో పాటు తడ్కల్, దెగుల్‌వాడి, నాగన్‌పల్లి, గాజుల్‌పాడ్, తదితర గ్రామాల్లో పీర్లను అందంగా అలంకరించి డప్పుదరువుల మధ్య నృత్యాలు చేస్తూ పురవీధుల్లో ఊరేగించారు. అసైదుల ఆడుతూ కార్యక్రమాలను జరుపుకున్నారు.

● రాయికోడ్: మండల కేంద్రంలోని మసీదులో ప్రతిష్ఠించిన పీర్లకు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. భాజాభజంత్రీల మధ్య గ్రామంలో యువకుల నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. కోడూరు సిరూర్, దౌల్తాబాద్, మామిడిపల్లి, సింగితం, కర్చల్, కుసునూరు, ధర్మపూర్, తదితర గ్రామాల్లో మొహర్రం జరుపుకున్నారు.



రామాయంపేట: ధర్మారంలో పీర్ల ఊరేగింపు

● చేగుంట: మండలకేంద్రంలో పీర్లను పురవీధుల్లో ఇంటింటా ఊరేగించారు. మొక్కుకున్న కోరికలను తీర్చాలని భక్తులు ఉదా బెల్లం, దట్టీలు సమర్పించుకున్నారు.

●చిన్నశంకరంపేట: మండలంలోని ఖాజాపూర్, టీమాందాపూర్, మిర్జాపల్లి గ్రామాల్లోని మొహర్రంను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పీర్ల చావిడీల్లో పీర్లను దర్శించుకొని దట్టీలు సమర్పించారు. డప్పు చప్పుళ్ల మధ్య పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. చెరువుల వద్ద అసైదులా ఆడి, చెరువులలో పీర్లను నిమజ్జనం చేశారు.

● రేగోడు: రేగోడు, గజ్వాడ, కొండాపూర్, మర్పల్లి, ప్యారారం, పోచారం తదితర గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పీర్లను ఊరేగింపులు నిర్వహించి కార్యక్రమాలను జరుపుకున్నారు.

● టేక్మాల్: మండల కేంద్రమైన టేక్మాల్‌తో పాటు పాల్వంచ బొడ్మాట్‌పల్లి, కుసంగి దన్నూర, అచ్చనపల్లితో పాటు ఆయా గ్రామాల్లో మొహరంను జరుపుకున్నారు. ఉదయం నుంచి పీర్ల వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి, ఏబీజీగాని కొట్టారు. అనంతరం పీర్ల వద్ద దట్టిలను కప్పి మొక్కులను తీర్చుకున్నారు.

● అల్లాదుర్గం: అల్లాదుర్గం మండలంలో పీర్లను డప్పు చప్పుళ్లతో ఊరేగిస్తూ ప్రధాన కూడళ్ల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో యువకులు, మహిళలు మజన ఆడారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువుల్లో పీర్లను నిమజ్జనం చేశారు. స్థానిక పోలీసులు గట్టి బోందోబస్తును ఏర్పాటు చేశారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు బుధవారం మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెద్దశంకరంపేటలో భాజాభజంత్రీలతో లాల్‌సాబ్, చాన్‌సాబ్, దూద్‌పీర్, మౌలాలి గుంటం, పీర్లను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం పాత గ్రామ పంచాయతీ వద్ద పీర్లను ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు.



కల్హేర్‌లో దూదిపీరుతో ఊరేగింపులో ప్రజలు

● రామాయంపేట: రామాయంపేట మున్సిపల్ పరిధి గొల్పర్తి, ధర్మారం గ్రామాల్లో పీర్ల పండుగ అట్టహాసంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్న పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● మాసాయిపేట: మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామంలో బుధవారం మొహర్రం సందర్భంగా పీర్లతో ఊరేగింపులు నిర్వహించారు. మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో పోతనపల్లి, కసంపల్లి, చందాయిపేట గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పోతనపల్లి గ్రామంలో అన్నదానం నిర్వహించారు.

● శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు బిజిలీపూర్, గంగయ్యపల్లి, గోమారం, నవాబ్‌పేట్, చిన్నగొట్టిముక్క, మగ్దుంపూర్ దొంతి తదితర గ్రామాల్లో పీర్లను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. పీర్లకు భక్తులు మలీదముద్దలు, చాదర్, ఊదు, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● మనోహరాబాద్: మనోహరాబాద్ మండల కేంద్రంతో పాటు కాళ్లకల్, పర్కిబండ, లింగారెడ్డిపేట్ గ్రామాల్లో ఉదయం వీధుల్లో పీర్లను ఊరేగించారు. అలాగే భక్తులు మొక్కులు ఉన్నవారు దట్టిలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

● వెల్దుర్తి: మండల వ్యాప్తంగా మొహర్రంను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని మంగళపర్తిలో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ పీర్లను ప్రధాన వీధులగుండా ఊరేగించారు. ప్రజలు పీర్లకు వద్దకు చేరుకొని మొక్కులను చెల్లించుకున్నారు.

● కొల్చారం: మండలంలోని పలు గ్రామాలో ప్రతిష్ఠించిన పీర్లను బుధవారం ఉదయమే డప్పు చప్పులతో ఊరేగించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పీర్లను చెరువుల్లో నిమజ్జనం చేశారు.